ఇకపై విద్యుత్ అంతరాయానికి చెక్

పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ గంగాధర్

- సరఫరా నిలిపేయకుండానే సబ్ స్టేషన్ల మెయింటనెన్స్
- పైలెట్ ప్రాజెక్ట్ కింద కరీంనగర్
- ప్రయోగాత్మకంగా టౌన్-8సెక్షన్ వాటర్ వరక్స్ సబ్ స్టేషన్‌లో అమలు

ముకరంపుర, అక్టోబర్ 19: సబ్ స్టేషన్ల మెయింటనెన్స్, మరమ్మతులు చేపట్టే సమయంలో విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని వినియోగదారులకు కనురెప్ప పాటు సైతం సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా ఎన్పీడీసీఎల్ సీఎండీ ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం పైలెట్ ప్రాజెక్ట్‌గా ఉమ్మడి కరీంనగర్ జిల్లాను ఎంపిక చేశారు. ఈ విధానాన్ని కరీంనగర్ టౌన్ సబ్ డివిజన్‌లోని టౌన్-8 సెక్షన్ 33/11కేవీ వాటర్ వరక్స్ సబ్ స్టేషన్‌లో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వాస్తవంగా సబ్ స్టేషన్‌లో మెయింటనెన్స్ సందర్భంగా అధికారులు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు నిర్ణయించారు. కానీ, సీఎండీ ఆదేశాలతో సరఫరా నిలిపివేయకుండానే మెయింటనెన్స్ పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు.

సరఫరాకు అంతరాయం లేకుండానే పనులు పూర్తి

మొత్తం సబ్ స్టేషన్ చుట్టూ ఉన్న ఆరు ఫీడర్లకు సమీపంలోని ఇతర ఫీడర్లను అనుసంధానించి సరఫరాకు ఇబ్బంది లేకుండా చేశారు. సబ్ స్టేషన్ లోపలికి మాత్రం సరఫరా లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది నిర్ణీత షెడ్యూల్ ప్రకారంగా సబ్ స్టేషన్ మెయింటనెన్స్ పనులు పూర్తి చేశారు. కొత్తగా అమలు చేస్తున్న విధానాన్ని ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, డీఈ జంపాల రాజం పరిశీలించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ప్రయోగాత్మకంగా అమలు చేస్తుండడంతో అన్ని విషయాలు నమోదు చేస్తూ.. అత్యంత జాగ్రత్తగా పనులు పూర్తి చేశారు. ఈ విధానంలో ఏవైనా ఇబ్బందులు.. లోటుపాట్లు తలెత్తితే వాటిని సరిచేస్తూ ఈ పద్ధతిని మిగిలిన సబ్ స్టేషన్లలో పాటించి మెయింటనెన్స్, మరమ్మతుల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఫసిఅహ్మద్, ఏఈ(టెక్నికల్) దీటి శ్రీనివాస్, టీఆర్ఈ, ప్రొటెక్షన్, టౌన్-8 సిబ్బంది ఎస్ఎల్ఐ మహేందర్ రావు, ఎల్ఐ ఇంద్రసేనా రెడ్డి, లైన్ మెన్ లు ప్రకాశ్, రవీందర్, సిబ్బంది ఉన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Huzurabad Branch. 1 issue the following notice to general public. My client intends to grant to loan to title Palle Sampath, S/o: Rajaiah, Age: 50 years, Occ: Nallagonda village Thimmapur mandal of Karimnagar dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice otherwise, later objections will not bind my client in this regard

SCHEDULE OF THE PROPERTY

In Nusthlapur revenue village the survey number 813, open place to an extent of 378.00 Square yards OR 317.52 Square meters, there were no constructions in this land, within the boundaries
East: House of Palle Yellaiah,
West: House of Thammanaveni Gangaiah,
North: Open place of Others,
South: Road leads to Nusthlapur to Mogilipalem village,
Is situated at Nusthlapur village
Thimmapur mandal of Karimnagar dist
Date: 19-10-2024

Sd/- **G. LAXMANA MURTHY,** ADVOCATE
20-237, Vidyanagar, Huzurabad. CELL: 94403 69866

నమస్తే తెలంగాణ CLASSIFIED

కావలెను

jobs Apply Now!

★**మ్యారేజ్ బ్యూరో నందు పని చేయుటకు** అమ్మాయి కావలి. చదువుతో నిమిత్తం లేకుండా మంచి వాక్చాతుర్యం గల నమ్మకంతో పర్మినెంట్‌గా పనిచేసే అమ్మాయి కావలెను. సంప్ర|| సెల్: 8341220970
NTK-335282

WANTED

★**Req. Cashier, Female Waiter,** South Indian Lunch & Tandoori Master, Housekeeping for Restaurant @ AS Rao Nagar. 9393123493, 7995900498.
NT-334839-All

కావలెను

★**వాటర్ ప్లాంట్‌లో** పనిచేయుటకు ఆటో డ్రైవర్లు కావలెను. కిరణ్ వాటర్ ప్లాంట్ భగత్‌నగర్, కరీంనగర్. సంప్ర|| సెల్: 6262229222, 9493369988
NTK-00000

WANTED PLOTS

★**హైదరాబాద్, హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ,** పసుమాముల, అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, గ్రీన్‌సిటీ, మౌంట్ ఒపేరా, సింగరేణికాలనీలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-336725-All

LAND FOR SALE

★**MANGO FARM for Sale: 12.5** Acres, 1 Km. from Siddipet Mustabad "T" Junction Road with 2 Borewells, Total Fencing. Ph: 9849633388 / 9391515600.
NT-98790

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

బాలికలు నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, అక్టోబర్ 19 : నేటి పోటీ సమాజంలో బాలికలు నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని, శనివారం మహిళా,శిశు సంక్షేమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పురుషులతో సమానంగా మహిళలు పోటీ పడుతూ, రాణిస్తున్న ఈ రోజుల్లో భ్రూణ హత్యలు జరుగుతుండడం దారుణమన్నారు. అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నా, వారిపట్ల మాత్రం వివక్ష తగ్గడం లేదన్నారు. జీవితంలో ధైర్యంగా ముందుకు వెళ్లేలా బాలికలను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. మహిళలకు సానుభూతి అవసరం లేదని, సాహసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బాలురకు ఇచ్చే ప్రోత్సాహం, బాలికలకు కూడా ఇవ్వాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. జీవితంలో ఎదిగేందుకు ఏ చిన్న అవకాశం లభించినా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, బాలికల పట్ల వివక్ష వారి కుటుంబాల నుంచే మొదలవుతుందన్నారు. ఈ దురాచారాన్ని విడనాడినప్పుడే బాలికలకు సమాన ప్రోత్సాహం లభిస్తుందన్నారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని, ఇందుకు కళ్లెదుట కనిపిస్తున్న ఉన్నత స్థాయి అధికారులే నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ మాధవి బాలికా సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికలు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, యోగా, జిమ్నాస్టిక్స్ విన్యాసాలు వీక్షకులను ఆకర్షించాయి. కార్యక్రమంలో డీడబ్ల్యూవో ఎం.సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, షీటీం ఇన్‌స్పెక్టర్ శ్రీలత, సీడబ్ల్యూసీ సభ్యురాలు రాధ, పలు పాఠశాలల నుంచి వచ్చిన బాలికలు పాల్గొన్నారు.

అలువాల విష్ణుకు వీర్ల పరామర్శ

గోపాల్‌రావుపేటలో అలువాల విష్ణును పరామర్శిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు తదితరులు

రామడుగు, అక్టోబర్ 19 : గోపాల్‌రావుపేటకు చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు, రమ్యకృష్ణ దంపతులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, తలకు బలమైన గాయమై కోమాలోకి వెళ్లిన రమ్యకృష్ణ చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం అలువాల విష్ణును బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు పరామర్శించారు. రమ్యకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే కొక్కెరకుంట విండో చైర్మన్ వొంటెల మురళీకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్, శ్రీ ప్రగతి విద్యాలయం కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ జవ్వాజి శేఖర్, మాజీ ఎంపీటీసీ గుండి ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు చాడ శేఖర్‌రెడ్డి, ఎడవెల్లి పాపిరెడ్డి, పూడూరి మల్లేశం, కొలిపాక కమలాకర్, గుమ్మడి ప్రశాంత్ తదితరులు పరామర్శించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే సత్యం

గంగాధర వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర, అక్టోబర్ 19 : రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర, కురిక్యాల సింగిల్ విండోల ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డీసీవో రామానుజాచార్యులు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జాగిరపు రజితాశ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు దూలం బాలాగౌడ్, వెలిచాల తిర్మల్‌రావు, వైస్ చైర్మన్లు వేముల భాస్కర్, తోట కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల ముగింపునకు హాజరు

గంగాధర, అక్టోబర్ 19 : మధురానగర్‌లో 15 రోజులుగా నిర్వహిస్తున్న జీపీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. ఫైనల్‌లో విజయం సాధించిన రాడూర్ కింగ్స్ జట్టుకు బహుమతి అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితాశ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, వైస్ చైర్మన్ వేముల భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధినేతను కలిసిన వొల్లాల వాణి

కేసీఆర్‌తో వొల్లాల వాణి

కమాన్ చౌరస్తా, అక్టోబర్ 19: ఉద్యమ గాయని వొల్లాల వాణి తన పుట్టిన రోజు సందర్భంగా శనివారం బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆమెను కేసీఆర్ ఆశీర్వదించారు.

నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే పాడి

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 19: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతు భరోసా ఎగ్గొట్టడంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం ఉదయం అన్ని నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం నిర్వహించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా అందిస్తామని చెప్పి రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పాలనను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

గ్రూప్-1 వన్ అభ్యర్థులపై దాడి హేయనీయం: మాజీ ఎమ్మెల్యే వొడితెల

సతీశ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే

చిగురుమామిడి, అక్టోబర్ 19: గ్రూప్-1 వాయిదా వేయాలని కోరిన అభ్యర్థులపై హైదరాబాద్‌లో పోలీసులు దాడి చేయడం హేయనీయమని, తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే గ్రూప్-1 రీషెడ్యూల్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలను నిరసించిన విద్యార్థుల గొంతును నొక్కడం సరైనది కాదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో విద్యారంగం పూర్తిగా భ్రష్టుపట్టిందని దుయ్యబట్టారు. విద్యా రంగంలోని సమస్యలను పట్టించుకునేవారే లేరని, విద్యా శాఖకు మంత్రి కూడా లేకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నదన్నారు. సర్కారు చర్యలతో పేద విద్యార్థులకు విద్య దూరమవుతున్నదన్నారు. గురుకుల స్కూల్ భవనాలకు అద్దె చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సతీష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో బావాబామ్మర్దులు మృతి

తిమ్మాపూర్, అక్టోబర్ 19: రోడ్డుపై ఆగిఉన్న లారీని మినీ ట్రక్కు వాహనం ఢీ కొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు బావాబామ్మర్దులు చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్కనపేట మండలం గుడాటిపల్లికి చెందిన భూక్యారాజు(46), దుల్మిట్ట మండలం కుటిగల్ గ్రామానికి చెందిన లావుడ్యా వాగ్య(30) సొంత బావాబామ్మర్దులు. ఎలక్ట్రికల్ టెక్నిషియన్స్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లాలో పనులు ముగించుకుని వారి మినీ ట్రక్కులో వాహనంలో ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో రాత్రి 11గంటల సమయంలో ఎల్ఎండీ కాలనీ సమీపంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఇండికేటర్స్ వేయకుండా రాజీవ్ రహదారిపై ఓ గ్రానైట్ లారీ నిలిపి ఉంచారు. దీంతో వారు గమనించకుండా వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో ట్రక్కు నడుపుతున్న వాగ్యతో పాటు పక్క సీట్లో కూర్చున్న రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనం వెనుక నుంచి ఢీ కొట్టడంతో ఇద్దరూ అందులోనే ఇరుక్కుపోయారు. స్థానికులు, ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించగా బ్లూకోల్ట్స్ సిబ్బంది సురేశ్, మల్లికార్జున్ స్థానికులతో కలిసి అరగంట పాటు శ్రమించి ఇద్దరినీ బయటకు తీశారు. ఎల్ఎండీ ఎస్ఐ వివేక్ ఘటనా స్థలానికి చేరుకుని దవాఖానకు తరలించారు. తీవ్ర గాయాలైన వారు చికిత్స పొందుతూ అర్ధరాత్రి తర్వాత మరణించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.

జగపతిరావుకు ఘన నివాళి

రాంనగర్, అక్టోబర్ 19: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే దివంగత వెలిచాల జగపతిరావు రెండో వర్ధంతిని శనివారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు యువసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ కార్పొరేటర్లు, జగపతిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కోడూరి సత్యనారాయణ గౌడ్, ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

చిగురుమామిడి/ సైదాపూర్, అక్టోబర్19: నాణ్యమైన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ రైతులకు సూచించారు. శనివారం చిగురుమామిడి మండలం ముల్కనూర్, చిగురుమామిడి, బొమ్మనపల్లి, సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లితో పాటు వివిధ గ్రామాల్లోని వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యాన్ని పరిశీలించి రైతులు, కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్లు రమేశ్, మంజుల, చిగురుమామిడి ఎంపీడీవో ఖాజా మొహినుద్దీన్, వెన్కేపల్లి-సైదాపూర్, వెన్నంపల్లి సింగిల్ విండోల చైర్మన్లు కొత్త తిరుపతి రెడ్డి, బిల్ల వెంకట్ రెడ్డి, నాయకులు గుండారాపు శ్రీనివాస్, తాల్లపెల్లి వెంకటేశం, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

నేడు ఎల్ఎండీ గేట్లు ఓపెన్

తిమ్మాపూర్, అక్టోబర్19: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో మిడ్ మానేరు జలాశయం పూర్తినీటిమట్టంతో ఉండగా.. ఇన్‌ఫ్లోకు అనుగుణంగా 5వేల క్యూసెక్కుల నీటిని ఎల్ఎండీలోకి అధికారులు వదలనున్నారు. దీంతో ఇప్పటికే 24టీఎంసీలకు గానూ 23.903టీఎంసీల నీళ్లు ఉన్న ఎల్ఎండీ పూర్తిస్థాయిలో నిండనున్నది. ఈ క్రమంలో అధికారులు ముందు చూపుతో ఎల్ఎండీ నుంచి రెండుగేట్లు ఎత్తి దిగువన మానేరు వాగుకు 4వేల క్యూసెక్కుల నీటిని వదలనున్నారు. నది పరీవాహక ప్రాంత రైతులు, పశుల కాపరులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఎల్ఎండీ ఈఈ నాగభూషణ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

సైనిక్ విద్యార్థులకు పతకాలు

చొప్పదండి, అక్టోబర్ 19: రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ఎన్.దినేశ్, జే. రోషన్ విలువిద్య పోటీల్లో బంగారు, రజత పతకాలు సాధించారు. జిల్లాస్థాయిలో అండర్19 ఎస్జీఎఫ్ఏ పోటీలు కరీంనగర్ మానేరు డ్యాం వద్ద నిర్వహించగా, వారు పాల్గొని సత్తా చాటారు. హైదరాబాద్‌లో త్వరలో జరుగబోయే రాష్ట్ర స్థాయి వివిధ పోటీల్లో వీరు పాల్గొంటారని సైనిక్ స్కూల్ డైరెక్టర్ కేసీ రావు తెలిపారు.

విద్యుత్ అధికారుల 'పొలం బాట'

గన్నేరువరం, అక్టోబర్19: మండలంలోని మైలారం, గన్నేరువరం గ్రామాల్లో విద్యుత్ శాఖ సేఫ్టీ డీఈ విజేందర్ రెడ్డి పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పలు సమస్యలను గుర్తించారు. ఓ ఇంట్లో పాతబడిన త్రీపిన్ ప్లగ్లను, సర్వీస్ వైర్లను తొలగించాలన్నారు. అనంతరం గ్రామస్తులకు పలు జాగ్రత్తలు వివరించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులను రైతులు సన్మానించారు. కార్యక్రమంలో ఏఈ ఆంజనేయులు, తెలంగాణ రైతు హక్కుల పోరాట సాధన సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లల జగన్, మున్నూరు కాపు గ్రామాధ్యక్షుడు బొడ్డు బాలయ్య, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముకరంపుర, అక్టోబర్ 19: నగరంలో పలు సబ్ స్టేషన్ల మెయింటెనెన్స్, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఆదివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ టౌన్- 1, 2 ఏడీఈలు పంజాల శ్రీనివాస్, లావణ్య వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

- ఉదయం 9నుంచి 11గంటల వరకు డాక్టర్ స్ట్రీట్, శ్రీనగర్, సివిల్ హాస్పిటల్ వెనుక ప్రాంతం, గాంధీ రోడ్ గర్ల్స్ జూనియర్ కాలేజ్ రోడ్డు, అహ్మద్ పుర, రూరల్ పోలీస్ స్టేషన్ ఏరియా, బోయవాడ, గంజ్, టవర్ సర్కిల్, సిక్ వాడీ, కమాన్ ఏరియా, సీపీ ఆఫీసు రోడ్డు, లక్ష్మీ నగర్, కమాన్ నుంచి హౌసింగ్ బోర్డ్ రోడ్డు, ఈఎన్ గార్డెన్ ఏరియా, యూనియన్ బ్యాంక్ ఏరియా, హెచ్‌పీ గ్యాస్ గోడౌన్, రెడ్డి ఫంక్షన్ హాల్ వెనుక ప్రాంతం, మెహర్ నగర్
- ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు భగత్ నగర్, ముకరంపుర, విఘ్నేశ్వర కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, ఎర్రగుట్టపల్లి, కట్టరాంపూర్, అంబేద్కర్ స్టేడియం, కలెక్టర్ కాంప్లెక్స్, బస్టాండ్ ఏరియా, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, ఎల్ఐసీ ఆఫీస్ ఏరియా, తిరుమల్ నగర్, గణేశ్ నగర్, హనుమాన్ నగర్, ధోబీవాడ, కమాన్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పట్టభద్రుల ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పాటునందిస్తా

- ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వీ నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 19 : పట్టభద్రులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా కృషి చేస్తానని, వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పాటునందిస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వీ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలు, కళాశాలలను ఆయన సందర్శించారు. ఆయా చోట్ల ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొని మాట్లాడారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ప్రైవేట్ యాజమాన్యాలతో మాట్లాడి, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను జారీ చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. వచ్చే జూన్‌లో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ నియోజకవర్గంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అల్ఫోర్స్ విద్యాసంస్థల తరఫున ఉచిత కోచింగ్ శిక్షణ కేంద్రాలను ప్రారంభిస్తానని చెప్పారు. కార్యక్రమాల్లో పలు విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసాను ఎగ్గొట్టడం రైతులను మోసం చేయడమే

వీణవంక, అక్టోబర్ 19: వానకాలం రైతుభరోసాను ఎగ్గొట్టడం రాష్ట్రంలోని రైతులను మోసం చేయడమేనని తన్నీరు హరీశ్‌రావు టీం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు అప్పని హరీశ్‌వర్మ పేర్కొన్నారు. వర్షాకాలానికి రైతు భరోసా పోయినట్లేనని వ్యవసాయ మంత్రి తుమ్మల చేసిన హరీశ్‌వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి ఎన్నో విధాలుగా రైతును ఏడిపిస్తున్న కాంగ్రెస్‌కు ఉసురు తప్పదని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు రైతుభరోసా ఇవ్వాల్సిందేనని, లేకుంటే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

జాతీయ అడ్వెంచర్ క్యాంపునకు ఎంపిక

కొత్తపల్లి, అక్టోబర్ 19 : శాతవాహన యూనివర్సిటీ జాతీయ సేవా పథకం విభాగానికి చెందిన పదిమంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయస్థాయిలో నిర్వహించే అడ్వెంచర్ క్యాంపునకు ఎంపికయ్యారు. హిమాచల్ ప్రదేశ్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటనీరింగ్ అండ్ ఎలైట్ స్పోర్ట్స్ ధర్మశాలలో అక్టోబర్ 22 నుంచి 31 వరకు నిర్వహించే క్యాంపులో వారు పాల్గొననున్నారు. ఈ అడ్వెంచర్ క్యాంపునకు కంటిన్జెంట్ లీడర్‌గా ఎస్ఆర్ఆర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పడాల తిరుపతి వ్యవహరించనున్నారు. క్యాంపునకు ఎంపికైన వలంటీర్లను శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ మనోహర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు అభినందించారు.

సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి, అక్టోబర్ 19 : ఎస్జీఎఫ్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో స్థానిక భగత్‌నగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన అండర్-14 బాలబాలికల వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న పాఠశాలకు చెందిన బి. నిఖిత, ఎ. హిందుశ్రీ, సన జిల్లాస్థాయి పోటీల్లో మొదటిస్థానం నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, డైరెక్టర్ దాసరి స్వప్న శ్రీపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

తెలంగాణచౌక్, అక్టోబర్ 19: హైదరాబాద్‌లో ముత్యాలమ్మ దేవత విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని భారతీయ బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రీరాంభట్ల దీపక్‌బాబు శనివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఇలాంటి ఘటనలు జరుగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. మత విభేదాలు సృష్టించేందుకు కొంత మంది స్వార్థపరులు చేస్తున్న ప్రయత్నాలను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.

చెక్కులు అందజేత

రాంనగర్, అక్టోబర్ 19: పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యం కారణంగా మరణించిన పోలీస్ అధికారుల కుటుంబాలకు భద్రత చెక్కులను శనివారం అడిషనల్ డీసీపీ ఎ. లక్ష్మీనారాయణ అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీతో పాటు సీపీవో జూనియర్ అసిస్టెంట్ కళ్యాణి ఉన్నారు.

23న ఇంటర్వ్యూలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 19 : కరీంనగర్ జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో వివిధ ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 23న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వై తిరుపతి రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 82476 56356, 95424 47544, 72076 59969 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సమస్యలపై పోరాటంలో ముందుంటా

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్ సింగ్

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 19: పట్టభద్రులతోపాటు భవిష్యత్తులో ఉపాధ్యాయుల సమస్యలపైనా పోరాడేందుకు ముందు వరుసలో ఉంటానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ పేర్కొన్నారు. మండలంలోని పర్లపల్లి, మన్నెంపల్లి గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను మేయర్‌గా కరీంనగర్‌ను ఎంతో అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. ఎమ్మెల్సీగా తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని విద్యావంతులను కోరారు. కార్యక్రమంలో నాయకులు పొన్నం అనిల్ గౌడ్, కెంసారం తిరుపతి, ముప్పిడి సంపత్ రెడ్డి, చిందం చంద్రమౌళి, సుద్దాల రాజేశ్, నార్ల అశోక్, దరిపెల్లి వేణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టై, బెల్ట్ లు అందజేత

మన్నెంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ ఆధ్వర్యంలో టై, బ్యాడ్జి, బెల్టలను సమకూర్చగా, ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మేయర్ రవీందర్ సింగ్ పంపిణీ చేశారు. మన్నెంపల్లి పాఠశాలలో 10వ తరగతిలో 9, 10 జీపీఏ సాధించిన విద్యార్థులను ఉచితంగా చదివిస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం మోహన్ రావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటాం: డీఈవో

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 19: పోచంపల్లి మోడల్ స్కూల్‌లో ఇటీవల ఉపాధ్యాయులు కొట్టడంతో ఓ విద్యార్థి హాస్పిటల్ పాలవగా, అందుకు బాధ్యులైన వారిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని డీఈవో జనార్దన్ రావు తెలిపారు. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల ఆదిత్య అనే 9వ తరగతి విద్యార్థిని హెయిర్ స్టైల్ విషయమై శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు కొట్టగా, అతడు స్పృహ తప్పిపోవడంతో కరీంనగర్ హాస్పిటల్‌లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం పాఠశాలకు వచ్చిన డీఈవో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల్లో ఏవైనా లోపాలు ఉంటే, సత్ప్రవర్తన వచ్చేలా ఉపాధ్యాయులు మోటివేషన్ చేయాలన్నారు. అంతకుముందు మోడల్ స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల ప్రత్యేక సమావేశాన్ని ప్రిన్సిపాల్ పద్మశ్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, మండల విద్యాధికారి మధుసూదనాచారితో కలిసి జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు.

జిల్లాస్థాయి జట్ల ఎంపిక పోటీలకు స్పందన

కొత్తపల్లి, అక్టోబర్ 19 : జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ అండర్-14 బాలబాలికల ఖోఖో జట్ల ఎంపిక పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లాలోని పలు మండలాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ మహిపాల్, టీజీజీపేట జిల్లా అధ్యక్షుడు సారయ్య క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ పేర్కొన్నారు. పోటీల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయులు బాబు శ్రీనివాస్, వీరన్న, సూర్య ప్రకాశ్, సంతోష్, శ్రీలత, ఎస్ రమేశ్, శోభ, జ్యోత్స్న, బిట్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'అలాయ్ బలాయ్'కి తరలి రావాలి

శంకరపట్నం, అక్టోబర్ 19: కొత్తపల్లి సాయిరాం గార్డెన్స్‌లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నేడు నిర్వహిస్తున్న 'అలాయ్ బలాయ్' సాంస్కృతిక కార్యక్రమానికి తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బాలిక కిడ్నాప్‌పై కేసు

హుజూరాబాద్, అక్టోబర్ 19: పట్టణంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన ఓ బాలిక (16) కిడ్నాప్ అయింది. ఆమె తల్లిదండ్రుల కథనం ప్రకారం.. శుక్రవారం సాయంత్రం కిరాణా షాప్‌కు వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక, తిరిగి రాలేదు. శనివారం ఉదయం వరకు సైతం ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే కాలనీకి చెందిన శేఖర్‌పై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, సదరు బాలిక ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నది. నిందితుడికి భార్య పిల్లలు ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అట్టహాసంగా బిర్లా మెరిమెంట్ షో

పాఠశాల మ్యాగ్జిన్‌ను విడుదల చేస్తున్న పాఠశాల బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 19: బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మెరిమెంట్ పేరుతో ఏర్పాటు చేసిన షో ఆద్యంతం ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, స్కూల్ చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత శక్తులను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ బబితా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బొమ్మకల్‌లో అక్రమ నిర్మాణాలపై విచారణ

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 19: బొమ్మకల్ గ్రామంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కలెక్టర్‌కు ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై ఎంపీవో జగన్‌మోహన్ రెడ్డి శనివారం విచారణకు వచ్చారు. సర్వే నంబర్ 28, 96 చెరువు కట్ట శిఖంలో అనుమతులు లేకుండా గృహనిర్మాణాలు చేస్తున్నారనే విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు ఎంపీవో తెలిపారు. అధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగింపు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 19 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్ల గడువు ఈ నెల 30 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి, కోఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఓపెన్ స్కూల్, ఐటీఐ, డిప్లొమా విద్యార్థులు, టీఎస్ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని రశీదు పొందాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 738 292 9755 నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు.

ముగిసిన మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరం

శంకరపట్నం, అక్టోబర్ 19: మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. చివరి రోజు కార్యక్రమంలో భాగంగా పైప్‌లైన్ జాయింట్లు, ఫిక్సింగ్, రిపేర్లు, ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చే విధానాలపై మాస్టర్ ట్రైనర్ శ్రీరాములు శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మంచినీటి సహాయకులకు మిషన్ భగీరథ ఎస్ఈ రాములు సర్టిఫికెట్లు అందజేశారు.

ఇల్లమ్ముకునే పరిస్థితికి తెచ్చిన్రు..

- సరైన వైద్యం చేయకుండానే అధిక బిల్లులు వసూలు చేసిన్రు
- రోగితో డీఎంహెచ్‌వో ఆఫీస్ ఎదుట నిరసన
- ప్రైవేట్ దవాఖానపై చర్యలకు డిమాండ్


చికిత్స పొందుతున్న సుధాకర్

కరీంనగర్ విద్యానగర్, అక్టోబర్ 19 : వైద్యం కోసం దవాఖానకు వస్తే పెద్ద మొత్తంలో బిల్లు వేసి తమ ఇల్లు అమ్ముకునే పరిస్థితి తెచ్చారని వాపోతూ రోగి బంధువులు శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. బాధితులు తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ మండలం శాత్రాజ్‌పల్లికి చెందిన లింగంపల్లి సుధాకర్ కిడ్నీ, ప్రాంకియాస్‌తో బాధపడుతూ గత నెల 27న కరీంనగర్‌లోని మంచిర్యాల చౌరస్తాలో గల ద్వారకామయి దవాఖానలో చేరాడు. మల్టిపుల్ సమస్యలు ఉండడంతో వైద్యులు వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. ఈ నెల 17న దవాఖాన యజమాన్యం రూ.4.51 లక్షల బిల్లు వేసింది. అయితే, దవాఖానలో సరైన చికిత్స అందించకుండా అధిక మొత్తంలో బిల్లులు వేశారని, ఇప్పటికే రూ.3 లక్షల వరకు చెల్లించినట్లు వారు వాపోయారు. మొత్తం బిల్లులు చెల్లిస్తేనే రోగిని డిశ్చార్జి చేస్తామని చెప్పడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అయినా, పట్టించుకోక పోకపోవడంతో అప్పు సప్పు చేసి రూ.3 లక్షలు చెల్లించామని తెలిపారు. బిల్లులు ఇవ్వకపోతే ఇల్లు అమ్ముకొని అయినా బిల్లు చెలిస్తేనే రోగిని డిశ్చార్జి చేస్తామని చెప్పడంతో అంబులెన్స్‌లో రోగిని తీసుకుని వచ్చి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. అధిక మొత్తంలో బిల్లులు వేసిన దవాఖాన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. తన తమ్ముడు అనారోగ్య సమస్యలతో దవాఖానకు వచ్చినా కేవలం గ్యాస్ ఎంటరాలజిస్ట్ వైద్యం చేశారని, అందుకే తమ తమ్ముడు బతికాడని, ద్వారకామయి దవాఖాన దోపిడీతో తాము ఇల్లు అమ్ముకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ విషయమై దవాఖాన మేనేజ్‌మెంట్ రాజ మహేందర్‌ను వివరణ కోరగా హాస్పిటల్ లో 21 రోజులు రోగికి చికిత్స అందించామని, ఇందులో పది రోజులు వెంటిలేటర్, 6 రోజులు సీపాప్ మిషన్‌పై చికిత్స అందించామని, హాస్పిటల్ బిల్లు కేవలం రూ.90 వేలు మాత్రమే చెల్లించారని, మరో రూ.లక్షా 10వేలు ఫార్మసీ, ల్యాబ్ బిల్లులు చెల్లించారని, రోగికి పూర్తి స్థాయిలో వైద్యం అందించామని ఆయన స్పష్టం చేశారు.